సాక్షి
సిద్దిపేట

బుధవారం : 26 : జూన్ : 2024



# నూతన ఒరవడి.. భలే సాగుబడి

- ఉద్యాన పంటల వైపు రైతుల చూపు
- సాంకేతికతతో అధిక దిగుబడులు

రైతులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నూతన ఒరవడి కనిపిస్తోంది. వాణిజ్య, ఉద్యాన పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏటేటా పంటల విస్తీర్ణం పెరుగుతోంది. పట్టు, చెరకు, బొప్పాయి, అరటి, డ్రాగన్ ఫ్రూట్స్.. ఇలా వేర్వేరు పంటలు సాగు చేయడం గమనార్హం. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడులు గడిస్తుండటం శుభపరిణామం. అలాగే వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్నకోడూరులో పట్టు పురుగుల పెంపకం, జహీరాబాద్ ప్రాంతంలో చెరకు, ఆలుగడ్డ, డ్రాగన్ ఫ్రూట్స్, మెదక్‌లో బొప్పాయి పంటల సాగుపై విశ్లేషణ కథనాలు.

వివరాలు 8లో ▶

## న్యూస్‌రీల్

### వైభవంగా శ్రవణ నక్షత్ర మహోత్సవం



విశేషాలంకరణలో వేంకటేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలోని వేంకటేశ్వరాలయంలో మంగళవారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి మూలవిరాట్టులకు విశేష అభిషేకం చేశారు. భక్తజన సామూహిక లక్షతులసి దళాలతో అర్చన చేశారు. నేత్రపర్వంగా సాగిన ఈ మహోత్సవంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం రాజగోపాల్‌పేటలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. చివరి రోజు నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 87 మంది విద్యార్థులు హాజరు కాగా అధికారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ లాగిన్‌ఐడీ పొందిన విద్యార్థులు ఈనెల 27 వరకు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలని, 28న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో రేపు జాబ్ మేళా

సిద్దిపేటఎడ్యుకేషన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, బ్రిడ్జికోర్సుతో ఎంఎల్‌టీ పూర్తి చేసిన విద్యార్థులు టెక్నికల్ ట్రైనీ ఉద్యోగాలకు నిర్వహించే మేళాలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పదో తరగతిలో 60 శాతం, ఇంటర్మీడియెట్‌లో 55 శాతం మార్కులతో పాసై 20 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. మేళాలో ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగంతో పాటు మూడు సంవత్సరాల బీఎస్సీ డిగ్రీ కోర్సును చదివించనున్నట్లు తెలిపారు. మొదటి రెండు సంవత్సరాలు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు టెన్త్, ఇంటర్మీడియట్ మెమోలతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. చక్కని అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6303 204295 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈఈ సెట్ పరీక్షలకు ఈ నెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డీఈఈ సెట్ పరీక్షను జూలై 10న నిర్వహించనున్నారు.

### కలెక్టర్‌ను కలిసిన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న నూతన ఎల్‌డీఎం హరిబాబు

సిద్దిపేటరూరల్: నూతన లీడ్ డిస్ట్రిక్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. హరిబాబు మంగళవారం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందించారు. దుద్దెడ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన హరిబాబు పదోన్నతిపై ఎల్‌డీఎంగా వచ్చారు. ఇప్పటి వరకు ఎల్‌డీఎంగా విధులు నిర్వహించి సత్యజిత్ బదిలీపై వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు.



సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

# రెండో రోజూ జూడాల సమ్మె

సిద్దిపేటకమాన్: తమ డిమాండ్ల సాధన కోసం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న సమ్మె రెండో రోజైన మంగళవారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర జూడా కమిటీ ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అత్యవసర సేవలు మినహా ఇతర వైద్య సేవలను నిలిపివేసి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో రాష్ట్ర జూడా కమిటీ జరిపిన చర్చలు సఫలం కాకపోవడంతో సమ్మె కొనసాగిస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు తెలిపారు. తమకు రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలని, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు తెలిపారు.

# నో బిల్స్..





సిద్దిపేట పట్టణంలోని బుక్‌స్టాల్‌లో ఓ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల నోట్ బుక్స్, స్టేషనరీ విక్రయిస్తున్నారు. 2017లో వ్యాట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి జీఎస్టీని తీసుకువచ్చింది. సదరు వ్యాపారి ఇంకా పాత టిన్ నంబర్‌తో కూడిన బిల్లులనే వినియోగదారులకు అందజేస్తున్నారు. ఈ బుక్‌స్టాల్ నిర్వాహకుడు జీఎస్టీ లైసెన్స్‌ను తీసుకుని బిల్లులపై జీఎస్టీ నంబర్‌ను పొందుపరిచి బిల్లులు ఇవ్వాలి. ఈ ఒక్క బుక్‌స్టాల్ కాదు జిల్లాలోని అన్నింటిల్లోనూ ఇదే దందా నడుస్తోంది. కొందరు వ్యాపారులు తెల్లకాగితంపై బిల్లు రాసి ఇస్తుండటం గమనార్హం. – సాక్షి, సిద్దిపేట

### జిల్లాలో జీరో దందా

- బుక్‌స్టాల్ నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- జీఎస్టీ చెల్లించకుండా వ్యాపారం
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ

జిల్లాలో జీరో దందా జోరుగా సాగుతోంది. బిల్లులు లేకుండానే రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే కేంద్రం, రాష్ట్రానికి ఆదాయం తప్పనిసరి. ఆదాయం సమకూరకపోతే సంక్షేమ పథకాలు అమలు కష్టతరమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. పన్నుల రూపంలో వచ్చే ఆదాయం రాకుండా వివిధ వ్యాపార సంస్థలు జీరో దందాకు తెరలేపుతున్నారు. ప్రతీ ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో నోట్ బుక్స్, స్టేషనరీని వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. వినియోగదారులకు బిల్లులు ఇవ్వకుండా కొందరు తెల్ల కాగితంపై, మరికొందరు వ్యాపారులు పాత బిల్లుల్లో రాసి ఇస్తున్నారు. ఇలా బుక్ స్టాల్ నిర్వాహకులు జీరో దందా నిర్వహిస్తున్నారు.

**జీఎస్టీ వసూలు చేస్తున్నా..**

జిల్లా వ్యాప్తంగా 150 వరకు బుక్‌స్టాల్ ఉండగా అందులో సగం కంటే ఎక్కువగా బుక్‌స్టాళ్లకు జీఎస్టీ లైసెన్స్ లేకుండానే విక్రయిస్తున్నారు. నోట్ బుక్స్‌కు 12శాతం, స్టేషనరీకి 18శాతం జీఎస్టీ చెల్లించాలి. వినియోగదారుని నుంచి జీఎస్టీ వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చెల్లించడం లేదు. ఏటా రూ.20లక్షల కంటే ఎక్కువ వ్యాపారం జరిగితే తప్పక జీఎస్టీ లైసెన్స్‌ను వ్యాపారి తీసుకోవాలి. విక్రయించిన ప్రతీ వస్తువుకు బిల్లును వినియోగదారునికి అందించాలి. ఆ బిల్లుపై జీఎస్టీ నంబర్, బిల్లుపై వరుస సంఖ్య ఉండాలి. బిల్లును కార్బన్ పేపర్ పెట్టి రాయాలి. ఒరిజినల్ బిల్లు వినియోగదారునికి, మరో బిల్లు బుక్‌తోనే ఉండాలి. ప్రతీ మూడు నెలలకు ఒక సారి క్రయ విక్రయాలను ఆన్‌లైన్‌లో ఫైల్‌చేసి జీఎస్టీని వ్యాపారులు చెల్లించాలి. ప్రతీ యేడాది రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. కానీ ఎక్కువ సంఖ్యలో బుక్ స్టాల్ నిర్వాహకులు తమ వ్యాపారం రూ.20లక్షల లోపే జరుగుతుందని చూపుతుండటంతో జీఎస్టీ పరిధిలోకి రావడం లేదు. దీంతో వాణిజ్య పన్నుల శాఖకు జీఎస్టీ చెల్లింపులు జరగడం లేదు.

### వ్యాపారులు.. అడ్డదారులు

వినియోగదారుని దగ్గర నుంచి వ్యాపారులు జీఎస్టీ వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి మాత్రం జీఎస్టీ చెల్లించడం లేదు. బిల్లులు ఇవ్వకుండా వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో రాబడి తగ్గుతుంది. ఈ ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలను ప్రైవేట్ స్కూల్ ప్రాంగణంలో లాభాపేక్ష లేకుండా విక్రయించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రైవేట్ పాఠశాలలో సైతం బుక్‌స్టాల్స్ వెలిశాయి. నోట్‌బుక్‌లు, స్టేషనరీని సైతం విక్రయిస్తున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండానే కొనసాగిస్తున్నారు. కొనుగోలు చేసినా వారికి బిల్లులు ఇవ్వకుండా జీరో దందా చేస్తున్నా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ వైపుగా చూడడమే లేదు. అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీరో దందాకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.

**రూ. 20లక్షలు దాటితే తప్పకుండా జీఎస్టీ పరిధిలోకి**

ఏడాదికి రూ.20 లక్షల లోపు వ్యాపారం జరిగితే జీఎస్టీ పరిధిలోకి రాదు. రూ.20 లక్షల దాటితే తప్పకుండా జీఎస్టీ లైసెన్స్‌ను తీసుకోవాలి. జీఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ హోల్డర్ అని ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

–పూర్ణచందర్, డీసీటీఓ

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ మనుచౌదరి
- సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, నిర్లక్ష్యం తగదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వైద్య విభాగాలను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలు, మందుల వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. లేబర్ రూంలో డెలివరీలు చేయడానికి స్పెషల్ బర్త్ చైర్ కావాలని వైద్యులు కోరగా ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రజలు ప్రభుత్వాస్పత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్యంతో పాటు శానిటేషన్ చాలా ముఖ్యమని, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆరోగ్యశ్రీ కౌంటర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ సదానందం, డాక్టర్ చందర్, పిడియాట్రిక్ విభాగ హెచ్ఓడీ డాక్టర్ కిషోర్‌కుమార్, చిన్నపిల్లల విభాగ వైద్యుడు డాక్టర్ కోట వేణు, ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల బలోపేతం

సిద్దిపేటరూరల్: మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మహిళా శక్తి కార్యక్రమం అమలుపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళ శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పాడిగేదలు, ఆవులు, పెరటి కోళ్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు, మిల్క్ పార్లర్, తదితర యూనిట్స్ అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఓ, పశుసంవర్ధకశాఖ అధికారి పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4 వ తరగతిలో అడ్మిషన్‌కు సంబంధించిన పోస్టర్లను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నాగేందర్ తో కలిసి కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో 4 వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. బాలురకు 60 సీట్లు, బాలికలకు 60 సీట్లు మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపిక 3 దశలలో ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# డబుల్ బెడ్రూం ఇళ్ల స్వాధీనం



ఖమ్మంపల్లిలో డబుల్ బెడ్రూం ఇంటిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించారు. గ్రామంలో 60 ఇళ్లను నిర్మించగా.. ఇందులో 41 ఇళ్లను అర్హులకు కేటాయించారు. రెండో జాబితాలో 19 ఇళ్లను తర్వాత పంపిణీ చేయాల్సి ఉంది. అయితే చేయలేదు. గ్రామానికి చెందిన కొందరు అందులో నివాసం ఉంటున్నారు. అధికారికంగా కేటాయించనప్పటికీ ఇళ్లలో ఉంటున్న విషయం అధికారులకు తెలియడంతో నోటీసులు అందజేశారు. ఖాళీ చేయమని చెప్పినప్పటికీ చేయకపోవడంతో మంగళవారం తహసీల్దార్ దిలీప్ నాయక్ ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీసుల సహకారంతో సిబ్బంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అక్రమంగా ఉంటున్న వారి ఇళ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లోని సామాను బయటపెట్టారు. తాళాలు వేసి ఇళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ అనురాధ



పట్టుబడిన గంజాయినీ పరిశీలిస్తున్న సీపీ అనురాధ

చిన్నకోడూరు(సిద్దిపేట): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యంగా కృషి చేద్దామని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో ఈ ఏడాది పట్టుబడిన 349 కిలోల గంజాయిని మంగళవారం మండల పరిధిలోని మాచాపూర్ శివారులో కాల్చివేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై జిల్లాలో ప్రత్యేక టీమ్స్‌తో నిఘా ఏర్పాటు చేశామన్నారు. యూత్ మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుకుందామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### నిమ్జ్ భూ బాధితులకు నేడు చెక్కుల పంపిణీ

ఝరాసంగం(జహీరాబాద్): నిమ్జ్‌కు భూములు కోల్పోతున్న బాధితులకు బుధవారం చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర హాజరు కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఝరాసంగంలో నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లను నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్ రెడ్డి, జహీరాబాద్ ఆర్డీఓ రాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సంజీవరావు, రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తుండ్రు

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న బుక్ డిపోలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలలు స్థానికంగా ఉన్న బుక్ డిపోల నిర్వాహకులతో కలిసి, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులకు తోడు, పాఠ్యపుస్తకాల ధరలు తల్లిదండ్రులకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

# పట్టు వీడని అసమ్మతి నేతలు

- వరుసగా మంత్రులతో భేటీలు
- నామినేటెడ్ పదవులపై ఫిర్యాదుల పర్వం



మంత్రి శ్రీధర్‌బాబుతో కాంగ్రెస్ అసమ్మతి నేతలు

గజ్వేల్: కాంగ్రెస్ అసమ్మతి నేతలు పట్టువీడటం లేదు. వరుసగా మంత్రులు, పార్టీ ముఖ్యనేతలను కలుస్తూ నామినేటెడ్ పదవులపై ఫిర్యాదుల పరంపరను కొనసాగిస్తున్నారు. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు పార్టీ కార్యకర్తలు, నాయకులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. తాజాగా మంగళవారం పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో అసమ్మతి నేతలు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ మార్కెట్ కమిటీతోపాటు ఇతర నామినేటెడ్ పోస్టులను ఏకపక్షంగా నియమించే ప్రయత్నం జరుగుతున్నదని, దీనివల్ల నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్న వారికి నష్టం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆరా తీసి, నామినేటెడ్ పదవుల పంపకంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి సైతం తీసుకెళ్తామని మంత్రులు, వేం నరేందర్‌రెడ్డిలు హామీ ఇచ్చినట్లు అసమ్మతి నేతలు తెలిపారు. ఇంకా టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, గోపాల్‌రావు, కాంగ్రెస్ గజ్వేల్, ములుగు మండలాల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, శ్రీనివాస్ గుప్త, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాశ్‌రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు విజయక్‌కుమార్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు మన్నె కృపానందం, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గోవా మద్యం స్వాధీనం

బాటిళ్లను ధ్వంసం చేసిన పోలీసులు



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: మండలంలోని చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు చేస్తుండగా గోవా నుంచి తీసుకువస్తున్న పలు రకాల బ్రాండ్‌లకు చెందిన 17.91 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు కేసులను నమోదు చేసి, అక్రమ మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16 మందికి జరిమానా, మరో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్షను సంగారెడ్డి జిల్లా కోర్టు విధించింది. ఆ మేరకు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాలు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 16 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున జరిమానా, మరో ఇద్దరికి రెండు వేల జరిమానాతో పాటు ఒకరికి మూడు రోజులు, మరో వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు లాలూనాయక్ పేర్కొన్నారు.

### సస్యరక్షణతో చీడపీడలకు చెక్

జోగిపేట ఏడీఏ అరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

వట్‌పల్లి(అందోల్): వరి, పత్తి పంటల సాగులో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జోగిపేట ఏడీఏ అరుణ సూచించారు. మంగళవారం పంటల సాగుపై డాకూర్ రైతు వేదిక భవనంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొ.జయశంకర్ విశ్వవిద్యాలయం వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ రైతు భరోసా కింద పెట్టుబడి సాయంపై విధివిధానాలను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. కాగా, పంటల సాగులో యోతాదుకు మించి ఎరువులను వాడరాదన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయరత్న, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### ఫుడ్ సేఫ్టీపై నిర్లక్ష్యం వద్దు

పటాన్‌చెరు: ఫుడ్ సేఫ్టీపై నిర్లక్ష్యం వద్దని, కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఎస్‌ఎస్ ఏఐ, ఫుడ్ సేఫ్టీ అండ్ వీల్స్ బృందం వ్యాపారస్తులను హెచ్చరించింది. ఆరోగ్య శాఖ మంత్రి, కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ, కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికాల వసతి గృహం, పలు ప్రైవేటు హాస్టల్లో ఈ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మౌలికసదుపాయాలు, పరిశుభ్రతపై ఆరా తీసింది. అలాగే శ్రీరామ్ లగ్జరీ పురుషుల ప్రైవేట్ హాస్టల్స్‌ను కూడా తనిఖీలు చేసి ఎఫ్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించింది. నాసిరకంగా ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా బృందం ప్రతినిధులు మాట్లాడారు. ఆహార పదార్థాలు నాణ్యత లేకుంటే, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# నూతన ఒరవడి.. భలే సాగుబడి

## వాణిజ్య పంటలు, ఉద్యాన సాగు వైపు రైతుల చూపు

రైతులు వాణిజ్య పంటలు, ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ వ్యవసాయ మూలాల నుంచి బయటపడి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఆ మేరకు లాభాలు గడిస్తున్నారు. ప్రభుత్వం కూడా తన వంతుగా సహాయ సహకారం అందజేస్తోంది. చంద్లాపూర్‌లో రైతులు పట్టు పరుగుల పెంపకం, జహీరాబాద్ ప్రాంతంలో వివిధ రకాల పంటలు, చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో బొప్పాయి సాగు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.



పట్టు పురుగులను పెంచుతున్న రైతులు

### ఓ .. పట్టు పడుతున్నారు..

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్టు పరిశ్రమ రైతులకు లాభదాయకంగా మారుతోంది. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ రైతులు పట్టు పురుగుల పెంపకం చేపడుతూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఆ మేరకు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్బరీ తోటల పెంపకం, పట్టుపురుగుల పరిశ్రమ చేపట్టి మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు. ఏడాదికి పది పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తోంది. దీంతో పట్టు సాగుకు ముందుకు వస్తున్నారు. గ్రామంలో 30 మంది రైతులు 150 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. దీనికి నీటి వినియోగం తక్కువే.. తక్కువ మంది కూలీలతో పంట పూర్తి చేయొచ్చు. పంట సాగుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. పట్టుగుళ్లను విక్రయించేందుకు జనగామ, తిరుమలగిరిలో మార్కెట్‌లు అందుబాటులో ఉన్నాయి.

### పట్టుతో లాభాలు సాధించవచ్చు

రైతులు సంప్రదాయ పంటల సాగు కంటే వాణిజ్య పంటల వైపు ఆసక్తి చూపాలి. పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచే పంటల వైపు రైతులు ముందుకు సాగాలి. ఎవరైనా పట్టు సాగు చేస్తే ముందుగా చంద్లాపూర్ రైతుల వద్దకు వచ్చి సాగు పరిశీలిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఎంతోమంది రైతులు ముందుకొస్తున్నారు. పట్టు సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఇంద్రసేనారెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమ ఉప సంచాలకులు



సాగులో ఉన్న జామతోట

### మంచి లాభాలు వస్తున్నాయి



ప్రతి ఏటా అల్లం, అరటి, బొప్పాయి పంటలను సాగు చేస్తున్నాను. ఆయా పంటల్లో ఏ ఒక్క పంట దెబ్బతిన్నా మిగతా పంటలతో కవరవుతోంది. ప్రస్తుతం అన్ని పంటలకు మంచి ధర లభించింది. 10 ఎకరాల్లో బొప్పాయి, 6 ఎకరాల్లో అల్లం, 5 ఎకరాల్లో అరటి పంటలు సాగు చేశాను. బొప్పాయిలో ఎకరాకు రూ.4లక్షల వరకు, అల్లంలో రూ.8లక్షలకు పైగా, అరటిలో రూ.3లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ఆయా పంటలకు మార్కెట్లో మంచి ధర ఉన్నందున లాభం వచ్చింది. పత్తి పంటను అసలే సాగు చేయను. 3 ఎకరాల్లో సోయాబీన్ వేశాను.

– గంజి మోహన్, రైతు–రంజోల్

### తీపిని పంచుతూ.. లాభాలు పెంచుతూ

జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు వాణిజ్య పంటల సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ బావులు, బోర్ల కింద 30 శాతం మేర పంటలను నీటి పారుదల కింద సాగు చేస్తున్నారు. వర్షాధారం కింద సోయాబీన్, మొక్కజొన్న, కంది పంటలను ఎక్కువగా వేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యానవన, చెరకు పంటల సాగు వైపే ఉత్సాహం చూపుతున్నారు. దీంతో ఆయా పంటలు విస్తారంగా సాగవుతున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో వరి సాగు మాత్రం 'జీరో'. పత్తి పంట కూడ అంతంత మాత్రంగానే ఉంటుంది. – జహీరాబాద్



సాగులో ఉన్న అరటి పంట

రైతులు జహీరాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా ఏటా సుమారు 25 వేల ఎకరాల్లో చెరకు పంటను సాగు చేస్తున్నారు. 650 ఎకరాల్లో అరటి, 771 ఎకరాల్లో జామ, 8,386 ఎకరాల్లో మామిడి, 635 ఎకరాల్లో బొప్పాయి, 4 వేల ఎకరాల్లో ఆలుగడ్డ పంటలను సాగు చేస్తున్నారు. 20 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, 300 ఎకరాల్లో టమాటా, 200 ఎకరాల్లో పచ్చిమిర్చి పంటలు వేశారు. ఆయా పంటలకు పెట్టుబడులు ఎక్కువ అయినప్పటికీ మార్కెట్లో మంచి ధర పలుకుతుండడంతో అధికంగా లాభాలు వస్తాయని రైతులు సాగు చేస్తున్నారు. చెరకు పంటకు నీటి తడులు తక్కువ అయినా, వర్షం ఎక్కువ అయినా దెబ్బతినకుండా ఉంటుంది. పంట గ్యారంటీగా వస్తుండటంతోనే అధికంగా సాగు చేసుకుంటున్నారు. పెట్టుబడులు పోనూ ఎకరానికి రూ.80వేల వరకు చేతికందుతుందని చెబుతున్నారు. అరటికి మంచి డిమాండ్ ఉండటంతో ఎకరాకు రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుంది. బొప్పాయి సాగు వల్ల ఎకరానికి పెట్టుబడులు పోగా రూ.4లక్షల వరకు లాభాన్ని ఆర్జిస్తున్నారు. ఇక అల్లం పంటకు మార్కెట్లో మంచి ధర ఉండటంతో ఎకరాకు రూ.8 లక్షల వరకు లాభం చేకూరుతోంది. టమాటా సాగు కూడా లాభదాయకంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

### బొప్పాయి.. ఆదాయం మెండోయి..



కొర్విపల్లిలో బొప్పాయి సాగు

బొప్పాయి సాగు చేపట్టి ఒక రైతు లాభాలు గడిస్తున్నాడు. యాజమాన్య పద్ధతుల ద్వారా ఏడాదికి రూ. 3 లక్షల ఆదాయాన్ని సంపాదిస్తున్నాడు. ఎకరాకు 15 టన్నుల చొప్పున దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ. 20 వేల వరకు ఉంది. ఒక్కసారి మొక్క నాటితే రెండేళ్ల వరకు కాపు ఇస్తుంది. ఈ లెక్కన ఒక ఎకరాలో రెండు సంవత్సరాలకు గాను 30 టన్నుల దిగుబడి.. రూ.6 లక్షల ఆదాయం వస్తుంది. మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటే ఈ లాభాలు మరింత ఎక్కువగా వస్తాయి.

– మెదక్‌జోన్



చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి శివారులో నిజమాబాద్‌కు చెందిన రైతు సాంబశివరావు 12 ఎకరాలలో బొప్పాయి సాగు చేశాడు. ఎకరానికి రూ. లక్ష పెట్టుబడి. యాజమాన్య పద్ధతులను అనుసరించి హార్టికల్చర్ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని సాగు చేశాడు. ఎకరంలో 1,250 మొక్కలు.. 12 ఎకరాల్లో 15 వేల మొక్కలను నాటాడు. ఆ తర్వాత డ్రిప్ ద్వారా నీటి తడులు అందిస్తున్నాడు. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చని చెబుతున్నాడు. 4 నెలలకు పూత పూసి, 8వ నెలకు దిగుబడి చేతికి అందుతుంది. ఒక్కో చెట్టుకు 150 వరకు కాయలు కాస్తాయి ఒకటి రెండు నుంచి మూడు కిలోల వరకు బరువు ఉంటుంది. కాగా, రెండు సంవత్సరాలు నిరంతరాయంగా పంట చేతికొస్తుంది. దీంతో ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణలోని హైదరాబాద్ తదితర రాష్ట్రాల్లో మార్కెటింగ్ ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో మొక్క మధ్య 3 మీటర్ల దూరం ఉండేలా నాటాడు. ఆ ఖాళీ స్థలంలో అంతర పంటగా దోస, అల్లం, పసుపు, ఖర్బూజ వంటి అంతర పంటలను సాగు చేయొచ్చని రైతు పేర్కొంటున్నాడు.

# పాపన్నపేటలో భారీ చోరీ

దుకాణానికి కన్నం వేసి చొరబడిన దొంగలు

- రూ.12 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ
- రంగంలో దిగిన డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం



చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): కిరాణా దుకాణం వెనుక గోడకు కన్నం వేసి చోరీ చేసిన ఘటన మండలకేంద్రంలోని మెదక్–బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. దొంగలు బంగారం, నగదు దోచుకెళ్లారు. ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం.. పాపన్నపేటకు చెందిన కూకుట్ల ప్రసాద్ ఎప్పటిలాగే తన కిరాణా షాపును సోమవారం రాత్రి 10 గంటలకు మూసేసి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు షాపు తెరిచి చూస్తే కౌంటర్ వద్ద సామానులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. షాపు వెనుక నుంచి గడ్డపారతో గోడకు కన్నం వేసి లోపలికి చొరబడ్డారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో కౌంటర్‌లో దాచిన రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారు ఆభరణాలు, 116 వెండి దోచుకెళ్లారని, వెళ్లేటప్పుడు టీవీ, సీసీ కెమెరాలు, డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారని, అప్పటికే బయట ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారని పేర్కొన్నాడు. కాగా, పోలీస్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సంఘటన స్థలికి చేరుకొని ఆధారాల సేకరించే పనిలో నిమగ్నమైంది. డాగ్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న మల్లంపేట గేట్ వద్దకు వెళ్లి ఆగింది. సంఘటన స్థలంలో అగంతకుల ఇయర్ ఫోన్స్, చోరీకి వాడిన గడ్డపారలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

# లారీలను ఢీకొన్న డీసీఎం

- ఇద్దరు మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- ఓఆర్‌ఆర్ ఎగ్జిట్–3 వద్ద ఘటన




మృతులు కాగేశ్ బంకీర, నూర్ ఇస్లాం లస్కార్

పటాన్‌చెరు టౌన్: లారీలను వెనుక నుంచి డీసీఎం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్‌ఆర్‌పై మంగళవారం తెల్లవారుజాము చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ వైపు నుంచి పటాన్‌చెరు వచ్చే రహదారిలో పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్‌ఆర్ ఎగ్జిట్–3 సమీపంలో రెండు కాంక్రీట్ లారీలను ఒక దాని తర్వాత మరొకటిని వెనుక నుంచి డీసీఎం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో డీసీఎంలో ప్రయాణిస్తున్న బిహార్‌కు చెందిన కాగేశ్ బంకీర(30), నూర్ ఇస్లాం లస్కార్(21)లు క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎం డ్రైవర్ సాయిరాంకు తీవ్రగాయాలు కాగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు మహబూబ్‌నగర్ అడ్డాకుల స్నేహ ఫాం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో కార్మికులుగా పని చేస్తున్నారు. ఆమేరకు పోలీసులు జేసీబీ సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూటీ చోరీ చేసి పారిపోతుండగా..

- దొంగను పట్టుకున్న స్థానికులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

శివ్వంపేట(నర్సాపూర్): స్కూటీ చోరీ చేసి పారిపోతుండగా స్థానికులు, యువకులు వెంబడించి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఉదంతం శివ్వంపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శివ్వంపేటకు చెందిన రుస్తుంపేట శ్రీను తన స్కూటీని స్థానిక వైన్స్ వద్ద పార్కింగ్ చేస్తే వాహనాన్ని తీసుకొని పారిపోతుండగా దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. గమనించిన స్థానికులు, యువకులు అతడి వెంట పడ్డారు. ఉసిరిపల్లి చౌరస్తా వద్ద పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇంకా అతని వద్ద నాలుగు స్మార్ట్ ఫోన్స్ లభ్యమయ్యాయి. మహారాష్ట్ర రాష్ట్రం నాగ్‌పూర్ ప్రాంతానికి చెందిన సర్ఫరాజ్ ఖాన్‌గా పోలీసులు గుర్తించారు. ఉసిరికపల్లిలో సిమెంట్ ఇటుకల పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిసింది. నిందితుడిని పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని యువకులు డిమాండ్ చేశారు.

## ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసిందని..

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): ప్రేమ వ్యవహారం కుటుంబీకులకు తెలిసిందని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం వర్గల్ మండలం నెంటూరులో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ములుగు మండలం కొక్కొండకు చెందిన గడ్డమీది మాధవి, నర్సింహులుగౌడ్ దంపతుల చిన్న కూతురు మహేశ్వరి(22) నూజివీడు కంపెనీలో పనిచేస్తుంది. ఇదే కంపెనీలో పని చేస్తున్న విజయ్‌కుమార్‌తో పరిచయం కాస్త ప్రేమగా మారింది. రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం మహేశ్వరి నెంటూరులోని తన అక్క ఇంటికి వచ్చింది. సోమవారం రాత్రి మహేశ్వరి విషయంలో వాట్సాప్ ద్వారా ఆమె అక్కకు ప్రియుడు చాటింగ్ చేశాడు. ఈ విషయాన్ని ఆమె తన భర్త సునీల్‌కు చెప్పింది. ఆయన శివంపేట మండలం పోతారానికి చెందిన వీరేందర్(విజయ్ కుమార్ బావ)కు ఫోన్ చేసి వాట్సాప్ చాటింగ్ విషయం చెబితే తన బావమరిదిని తెలుసుకుని చెబుతానన్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం మహేశ్వరీతో తాను కలిసి దిగిన ఫొటోలను ఆమె అక్క ఫోన్‌కు ప్రియుడు వాట్సాప్ చేశాడు. దీంతో తమ ప్రేమ వ్యవహారం కుటుంబీకులందరికీ తెలిసిపోయిందని మనస్తాపంతో మహేశ్వరి బాత్రూంలో పైపునకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి తల్లి మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- మద్యం బాటిల్స్ దగ్ధం



రెస్టారెంట్‌లో కాలిపోయిన లోపలి భాగం

సిద్దిపేటజోన్: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం తెల్లవారుజాము అగ్నిప్రమాదం సంభవించింది. క్యాష్ కౌంటర్ ఫర్నిచర్‌కు మంటలు అంటుకున్నాయి. ఫైర్ సిబ్బంది, బాధితుల కథనం ప్రకారం... స్థానిక ముస్తాబాద్ రోడ్డు మార్గంలోని బాలాజీ బార్ రెస్టారెంట్ కౌంటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే వెనుక భాగంలో ఉంటున్న సిబ్బంది వంటగదిలో ఉన్న సిలిండర్లు బయటకు తెచ్చి, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. మరోవైపు స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈలోపు ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. మరోవైపు కౌంటర్ సెల్ఫ్ లో ఉన్న మద్యం బాటిల్స్ పగిలి మద్యం అగ్నికి తోడై మంటలు ఎగిసి పడుతున్నాయి. ఒకదశలో అగ్నిమాపక సిబ్బంది ముందు భాగంలో మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీనితో జేసీబీ వాహనాన్ని రప్పించి షట్టర్‌ను తొలగించారు. ఒక్కసారిగా మంటలు, పెద్ద ఎత్తున పొగ బయటకు రాగా వెంటనే సిబ్బంది నీళ్లతో పూర్తిగా మంటలను ఆర్పివేశారు. ఇప్పటికే మంటలు అలుముకొని క్యాష్ కౌంటర్ ఫర్నిచర్ కాలిపోయింది. ఈ ప్రమాదం వల్ల లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. ఒక వేళ మంటలు పూర్తి స్థాయిలో విస్తరించి రెస్టారెంట్ వెనుక భాగంలో వ్యాపించి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

## బైక్ దొంగ అరెస్టు

ఆరు బైకుల స్వాధీనం



బైక్ దొంగతో పాటు స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాక: బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పట్టుకొని, అతడి నుంచి ఆరు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను దుబ్బాక సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ నెల 21 చీకోడ్ బాబా ఆశ్రమం వద్ద బైక్ చోరీకి గురైందన్న ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సీసీ కెమెరాల ఆధారంగా రామక్కపేటకు చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తే చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతోపాటు సిద్దిపేటలోనూ బైక్‌లు దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో సైతం నిందితుడు భూంపల్లి, దుబ్బాక పోలీస్ స్టేషన్ల పరిధిలో సెంట్రింగ్ సామగ్రితో పాటు కిరాణా దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ గంగరాజు,పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక డంపులపై కొరడా



ఇసుక డంపును సీజ్ చేస్తున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకపై పోలీస్‌లు కొరడా ఝళిపించారు. మంగళవారం మద్దూరు పోలీస్‌లు, రెవెన్యూ అధికారులతో కలిసి చేర్యాల సీఐ శ్రీను.. జాలపల్లి గ్రామ శివారులో 12 ఇసుక డంపులపై దాడులు చేశారు. ఇందులో డంపులను అధీనంలో తీసుకోగా, 150 ట్రాక్టర్ల లోడ్‌ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. వాటిని దూల్మిట్ట తహసీల్దార్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా, డంపు చేసినా వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇసుక డంపు, అక్రమ రవాణా చేసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఉరేసుకుని రైతు...

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలం బాచేపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలాన్నాయి.. గ్రామానికి చెందిన కర్రె రాములు(47) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాములు ఇటీవల కూతురు వివాహం చేశాడు. పెళ్లికి చేసిన అప్పులు, కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అతడి మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.